క్లుప్తంగా...

నేడు కంటోన్మెంట్ డిపోలో రక్తదాన శిబిరం

కంటోన్మెంట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్టీసీ కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రామ్మోహన్ అన్నారు. మంగళవారం (నేడు) కంటోన్మెంట్ డిపో ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ సిబ్బందితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని ఆసక్తి గల ప్రయాణికులు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డిపోకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనవచ్చన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.75, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 85, బజ్జీమిర్చి 73, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 17, క్యారెట్ 47, దొండ 23, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 85, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 20, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

బీఆర్‌ఎస్‌కు త్రికాల మనోజ్ గుడ్‌బై



రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు త్రికాల మనోజ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా బరిలో నిల్చున్నానని మంత్రి శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు నామినేషన్ విత్‌డ్రా చేసుకుని బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు ఆయన వెల్లడించారు. గతంలో హామీ ఇచ్చినట్లు పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పించకపోగా నామినేటెడ్ పదవి ఇస్తామని ఇవ్వలేదన్నారు. బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో సామాన్య కార్యకర్తలను వేదికపైకి పిలిచి తనను మాత్రం పిలువకుండా అవమానించారని తనకు పార్టీలో ప్రాధాన్యం లేకపోవడంతోనే పార్టీని వీడుతున్నానని చెప్పారు.

మంత్రి తలసానికి సన్మానం



అమీర్‌పేట: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బల్కంపేట రేణుకా ఎల్లమ్మ దేవాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. సోమవారం అర్చకులు, అధికారులు, పాలక మండలి సభ్యులు మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసానికి వెళ్లి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణ వేడుకల నిర్వహణలో మంత్రి ముందుండి నడిపించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ, ట్రస్టీ చైర్మన్ సాయిబాబాగౌడ్ పాల్గొన్నారు.

అంబర్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



బౌద్ధనగర్: స్థానికంగా నెలకొని ఉన్న నీటి లీకేజీ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. సోమవారం అంబర్‌నగర్‌లో ఆమె జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అంబర్‌నగర్‌లోని మంచినీటి లీకేజీ సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట ఏఈ శశిధర్, ఏఈ ప్రియాంక, శ్రీకాంత్, పాక సాయి, జగదీష్ ఉన్నారు.

రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

రాంగోపాల్‌పేట్: రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంగోపాల్‌పేట్‌కు చెందిన చీర సత్యనారాయణ ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఉన్న ఆయనను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. రోలర్ స్కేటింగ్ అభివృద్ధికి కృషి చేస్తానని సత్యనారాయణ హామీ ఇచ్చారు.

ప్రశ్నిస్తే 6 లేదంటే 4 ఇంచులే!

- ఇష్టానుసారంగా తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులు
- స్థానికుల ఆందోళనతో వివేకానంద వీధిలో ఆరించుల పైప్‌లైన్

లాలాపేట: ఆందోళన చేస్తూ అధికారులను నిలదీస్తే 6 ఇంచులు తాగునీటి పైపులైన్ వేస్తారు.. ఎవరూ అడగకపోతే 4 ఇంచుల పైపులైన్ వేస్తారు తార్నాక డివిజన్‌లో జలమండలి అధికారులు. అక్కడ ఉన్న జనాభా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి పైపులైన్ల నిర్మాణం చేయాల్సిన జలమండలి అధికారులు అవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నూతన పైపులైన్ నిర్మాణం చేస్తున్నారని దీంతో రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు వచ్చే అవకాశం ఉందని లాలాపేట ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల లాలాపేటలోని వివేకానంద వీధిలో జలమండలి అధికారులు నూతన తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో ఉన్న 4 ఇంచుల పైపులైన్ నిర్మాణం చేస్తుండటంతో అక్కడి ప్రజలు పనులను అడ్డుకున్నారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా 6 ఇంచుల లైన్ వేయాలనీ లేదంటే పనులు అడ్డుకుంటామని హెచ్చరించడంతో అధికారులు ఓ మెట్టు దిగివచ్చి 6 ఇంచుల లైన్ వేస్తున్నారు. మిగతాది యాథావిధిగా 4 ఇంచుల లైన్ల నిర్మాణం చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



4 ఇంచులు వేస్తుండటంతో పనులు అడ్డుకున్న స్థానికులు (ఫైల్)

కానరాని పర్యవేక్షణ

పనులు జరుగుతున్న ప్రాంతంలో అధికారులు, సూపర్‌వైజర్, సదరు కాంట్రాక్టర్ ఎవరూ అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్మికులు వారికి తోచిన విధంగా ఎత్తు పల్లాలు ఎలాంటి లెవల్స్ చూడకుండానే ఒక వైపు జేసీబీతో తవ్వకుంటూ మరో వైపు పైపులైన్లు వేసుకుంటూ వెళ్తున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా చేస్తే భవిష్యత్‌లో పైపులైన్ల ధ్వంసం, వాటర్ లీకేజీ, నీటి కాలుష్యం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని లాలాపేట వాసులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.



లాలాపేటలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ పనులు

దశలవారీగా సమస్యలకు పరిష్కారం

సికింద్రాబాద్: దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. బీదల బస్తీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలతో సమావేశం..

సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన సమైఖ్య మహిళ పొదుపు సంఘం సమావేశంలో కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల సమగ్ర వికాసానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అందులో భాగంగానే మహిళా స్వయం సహాయక సంఘాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న మహిళ సంఘంలోని సభ్యులకు త్వరగా మంజూరయ్యేలా అధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో యూసీడీ సీఓ ధనుశ్రీ, ఆర్పీ పద్మ, అర్చన, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

రాంగోపాల్‌పేట్: రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తే అత్యవసర సమయాల్లో ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. సోమవారం ఎస్పీరోడ్డులోని పీ–9 ఆస్పత్రిలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, సుమన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సంయుక్తాధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. ఇటీవల సడెన్‌గా హార్ట్ ఎటాక్‌లతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని హార్ట్ ఎటాక్‌కు గురైన వ్యక్తి శ్వాసతీసుకోలేక ఇబ్బంది పడటం, పల్స్ దొరకని పరిస్థితుల్లో సీపీఆర్ చేయాలని చెప్పారు. రోడ్లపై విధులు నిర్వహించే సమయంలో ఎవరికైనా హార్ట్ ఎటాక్ వస్తే వెంటనే పోలీసులు స్పందించేందుకు వారికి వైద్యులతో సీపీఆర్‌పై శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నగ్మా, ఎండీ కృష్ణ ప్రసాద్, జీఎం ఉత్తేజ్, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నేటి నుంచి సాయి సప్తాహ ఉత్సవాలు ప్రారంభం



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన సాయిబాబా దేవాలయంలో సాయి సప్తాహ ఉత్సవాలు ఈ నెల 27న ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. నేటి నుంచి జూలై 3 వరకు ఉత్సవాలు ఉంటాయని డాక్టర్ సాయి కుమార్ వ్యాధి నివారణ ఆశ్రమ కార్యదర్శి చలువరాయనంద పేర్కొన్నారు. ప్రతి రోజు సాయిబాబాను వివిధ రూపాల్లో అలంకరించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. నిత్యం వందలాది మంది పాల్గొనే సాయిసప్తాహ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. జూలై 3న జరిగే గురుపౌర్ణమి మహోత్సవంలో సద్గురు సాయికుమార్ బాబా భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు.

జలమండలి సేవలు భేష్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి విచ్చేసిన లక్షలాది మందికి మంచినీరు సరఫరా చేయడంలో జలమండలి అధికారులు ఎంతో శ్రమించారని రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ అన్నారు. సోమవారం చీఫ్ మేనేజర్ ప్రభు, జీఎం హరిశంకర్, మేనేజర్లు మౌనిక, హర్షిణి, కృపాకర్‌తో పాటు ఇతర సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం చుట్టూ 10 గుడారాలను ఏర్పాటు చేసి దర్శనానికి వచ్చిన వారికి మినరల్ నీటిని పంపిణీ చేశారని తెలిపారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు చల్లని వాటర్ బాటిళ్లను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అమరేశ్వరి, విజయశ్రీ, అమరావతి, నాగేంద్రమ్మ, లీలావతి, నాగరాజు పాల్గొన్నారు.



జలమండలి అధికారులను సన్మానించిన రాయల సేవా సమితి ప్రతినిధులు

దరఖాస్తులకు బారులు



ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో బోధనేతర (నాన్ టీచింగ్) ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. చివరి రోజు కావడంతో దరఖాస్తులను సమర్పించేందుకు వందలాది మంది నిరుద్యోగులు బారులు తీరారు. –ఉస్మానియా యూనివర్సిటీ

గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను ఈ విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చింతల కిశోర్‌కుమార్ కోరారు. జూన్ 1వ తేదీ నుంచే కళాశాలల తరగతులు ప్రారంభం అయ్యాయని పాఠాలు బోధించేందుకు అధ్యాపకుల సర్వీసులను రెన్యువల్ చేయాలని కోరారు.

పదవీ విరమణ



సికింద్రాబాద్: మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ కరీముల్లా సేవలు అభినందనీయమని యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్. శంకర్‌రావు అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ కరీముల్లా పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ.. కరీముల్లా మజ్దూర్ యూనియన్‌లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా సమస్యలపై పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం యూనియన్ నాయకులు ఆయనను శాలువాలతో సత్కరించారు. జోనల్ అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్, సరోజిని రెడ్డి, ఉదయ్ భాస్కర్, మురళీధర్, వరప్రసాద్, రవీందర్, ఖాజా, శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మౌలాలి–బీబీనగర్ రైల్వే స్టేషన్ల మార్గమధ్యలో ఆదివారం రాత్రి సుమారు 30–35 వయస్సున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు షర్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి 14 రోజుల జైలు

అడ్డగుట్ట: ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన నిందితుడికి జైలు శిక్ష విధించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మోహన్ సింగ్ వివరాల ప్రకారం..అడ్డగుట్టకు చెందిన కుక్కల కనకరాజు(32)సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈ నెల 21న ఈస్ట్‌మారేడుపల్లిలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడి గ్యాస్ సిలిండర్, ల్యాప్‌టాప్, సైకిల్, సోనీ కెమెరాను ఎత్తుకెళ్లాడు. యజమాని చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన కనకరాజును అదుపులోకి తీసుకొని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న యువకుడి మృతి



రాంగోపాల్‌పేట్: కాలిన గాయాలతో ఓ యువకుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 31న సుమారు 20 ఏళ్ల యువకుడు ఓ వస్త్రాల దుకాణం ముందు పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. యువకుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పాటు అతని చిరునామా చెప్పలేదు. ఒంటిపై కాలిన గాయాలు ఎలా అయ్యాయి అనే విషయం కూడా చెప్పలేదు. సంబంధీకులు ఉంటే మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

వార్డు కార్యాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లాలాపేట: నగర ప్రజల సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం తార్నాక డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మంత్రి కేటీఆర్ ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డు కార్యాలయాల ఏర్పాటు జరిగిందన్నారు. ఇక్కడ అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరిస్తారని వివరించారు. సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సేవలు ఇక్కడే అందుబాటులో ఉంటాయన్నారు. అధికారులు సైతం తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వార్డు కార్యాలయానికి వచ్చే ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, ఏఎంసీ హేమలత, ఏఈ వెంకటేష్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ముంతాజ్ బేగం, జలమండలి డీజీఎం సరిత, మేనేజర్లు లికిత, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

ముదిరాజ్‌లకు కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

బౌద్ధనగర్: ముదిరాజ్ కులాన్ని అవమాన పరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకొని అతన్ని పదవి నుంచి తొలగించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్శిగుట్ట చౌరస్తాలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై సీఎం కేసీఆర్ 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామన్నారు. బాధ్యత గల పదవిలో ఉంటూ ఓ జర్నలిస్టును కిడ్నాప్ చేసి ముదిరాజ్ కులాన్ని అవమానపరిచేలా మాట్లాడడం సబబు కాదన్నారు. కౌశిక్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, సతీష్ రాజ్, హనుమంతు, మధు, శ్యామ్, రాజ్, ఓములు, క్రాంతి, వెంకటేష్, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పుస్తకాల పంపిణీ

బౌద్ధనగర్: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పార్శిగుట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కనకయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు అండగా ఉంటూ ఉన్నత చదువులకు మరింత ప్రోత్సాహం అందించేలా ముదిరాజ్ సంఘం పని చేయాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు అండగా నిలువాలన్నారు. నాగేష్ ముదిరాజ్, మధు ముదిరాజ్, సతీష్, వెంకటేష్, ఓములు, రమేష్, అరుణ్, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మేకల సారంగపాణి

సనత్‌నగర్‌లో కలుషిత నీటి సరఫరా

సనత్‌నగర్: కలుషిత నీటి సరఫరాతో జనం జంకుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో కలుషిత నీటి సరఫరా సనత్‌నగర్ వాసులను ఆందోళనకు గురి చేస్తోంది. ఎస్ఆర్‌టీ 389 నుంచి 395 వరకు మంచినీటితో కలిసి మురుగునీరు సరఫరా అవుతోంది. ఎప్పటికప్పుడు పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టి అవసరమైన చోట్ల కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటనలు గుప్పించే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇక్కడి కలుషిత నీటి సరఫరాపై ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. రంగుమారిన నీటితో పాటు దుర్వాసన కూడా వస్తుండడంతో తాగే మాట దేవుడెరుగు కనీస అవసరాలకు కూడా వాడుకునేలా లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్వామి టాకీస్ వైపు నుంచి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయం వరకు తవ్వకాలు జరిపారు. ఈ క్రమంలో ఎక్కడైనా మంచినీటి పైప్‌లైన్లు ధ్వంసమై ఉండొచ్చని, తవ్వకాలు జరిపిన తర్వాత నుంచే కలుషిత నీటి సరఫరా జరుగుతుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై వాటర్‌వర్క్స్ మేనేజర్ మౌనికను వివరణ కోరగా మంచినీటికి సంబంధించిన మ్యాన్‌హోల్ ధ్వంసమైన దృష్ట్యా సరఫరాలో కలుషితం అయ్యి ఉండొచ్చని, మ్యాన్‌హోల్ మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



రంగుమారి సరఫరా అయిన తాగునీరు

భోలక్‌పూర్‌లో ఇంటింటికీ బీజేపీ

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లో బీజేపీ నాయకులు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, నాయకులు గుంటి సత్యనారాయణ, ఎ. శ్రీనివాస్ పలు బస్తీల్లో పర్యటిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజలు సూచించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సదానంద్, రఘురామ్, శ్రీకాంత్, చందు, అభినవ్, ఈశ్వర్, దేశ్ పాండే, సందీప్ ఆనంద్, పిట్ల శ్రీనివాస్, నర్సింగ్ రావు, పరమేష్, రాములు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో..

రాంగోపాల్‌పేట్: బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశం పురోభివృద్ధి చెందుతుందని మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని గైదీన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు దేశంలో జరిగిన అభివృద్ధి గురించి వారికి వివరించారు. కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, దయానంద్‌రావు, అఫ్జల్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు అమ్ముకున్నారంటూ ఫిర్యాదు

రసూల్‌పురా: బినామి పత్రాలు సృష్టించి డబుల్ బెడ్రూమ్‌ల కొందరు బీఆర్‌ఎస్ నేతలు విక్రయించారంటూ బీఎస్పీ నాయకులు, బాధితులు సోమవారం నార్త్‌జోన్ డీసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు ఉప్పులేటి రాజేందర్ మాట్లాడుతూ.. కృష్ణనగర్ సిల్వర్ కాంపౌండ్ వద్ద 2017లో నిర్మించిన ఇళ్లకు సంబంధించి168 మంది లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉండగా 161 మందికి మాత్రమే కేటాయించారని మిగిలిన ఇళ్లను బినామి పేర్లు సృష్టించి లక్షల్లో అమ్ముకున్నారన్నారు. ఇదేమని అడిగితే అసలైన లబ్ధిదారులను చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదు పేర్కొన్నారు. గతంలో జిల్లా కలెక్టర్, ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో యూసుఫ్, అవినాష్ జాదవ్, నాగేందర్ ఉన్నారు.

సీఎంను కలిసిన క్రిశాంక్

కంటోన్మెంట్: తెలంగాణ మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. మంగళవారం తన పుట్టిన రోజు పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకున్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు, ఉద్యమకారుడు ప్రభాకర్ అకాల మరణంతో పుట్టి న రోజు వేడుకలు జరుపుకోవడం లేదన్నారు.



కేటీఆర్‌ను కలిసిన మర్రి



కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి మంత్రి కేటీఆర్‌ను కలిశారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న మరణానంతరం నియో జకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఇక్కడి పార్టీ పరిస్థితులపై మంత్రితో చర్చించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేయాల్సిందిగా కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.